న్యూజెర్సీ కథల పోటీలో 150/-లు గెలుచు కున్న రచన

# చిన్న చేపలు

సమాజంలో పైవర్గం కింది వర్గాన్ని దోపిడీ వెయ్యడం ఎంత వాస్తవమో, ఏ వర్గానికి చెందిన వాళ్ళు ఆ వర్గంలోనే దోపిడీ వెయ్యబూనుకోవడం కూడా అంతే నిజం!

ఆ దినం పొద్దు పుట్టగానే గొంతులో ఇన్ని కాఫీ నీళ్ళు పోసుకుని కోళ్ళను తిప్పలాడసాగినాడు రామప్ప. వాటిని పేటలో అమ్మి నూరో నూటా ముప్పై రూపాయలో వస్తే, ఆ డబ్బుతో సమితి ఆఫీసుకు పోయి సబ్సిడీ బోరుకు ప్రయత్నించాలని అతని ఆలోచన.

గుడ్లు పెట్టే కోడి కేర్ కేర్‌మంటూ ఒదిగి ఒదిగి పరుగెత్తుతూ తొందరగానే దొరికిపోయింది. మిగిలిన రెండు పుంజు కోళ్ళూ గంట సేపు సతాయించిగానీ రామప్ప చేతికి చిక్కలేదు.

వాటి కాళ్ళని నార పాసల్తో కట్టేసి ఇంట్లో ఒక మూల పడేసినాడు. అవి కొక్కొక్కొ అంటూ గుడ్లు మిటకరిస్తూ భయంతో ఆయాసంతో రొప్పుతుంటే ముద్ద తినడం ముగించి, బీడీ అంటించినాడు.

ఒకసారి బీడీని దమ్ముపట్టి పీల్చి పొగను గాల్లోకి ఊది భార్య ముఖంవైపు చూసినాడు. భార్య చూపులు గుడ్ల కోడి మీదే తచ్చాడుతున్నాయి. ఆయమ్మ ఏడు నెలల గర్భిణి. అతనికి డాక్టరు మాటలు గుర్తుకు వచ్చినాయి.

"నీ భార్య చాలా బలహీనంగా వుంది. శరీరంలో రక్తం లేదు. పైగా ఆయమ్మ ఉత్తమనిషి కూడా కాదు. జాగ్రత్తగా చూసుకోవల్ల. దినానికి ఒకటి పచ్చి కోడి గుడ్డు తాగిస్తే మంచిది."

కానీ ఏం చేస్తాడు? యాభయ్యో నూరో ముట్టచెబితే తప్ప సబ్సిడీ బోరు అప్లికేషను మీద బి.డి.ఓ. సంతకం పెట్టడు. బోర్ వేయించుకోకపోతే ఎండిన బావిలో నీళ్ళు పడవు. ఆ యాభయ్యో నూరో డబ్బులు తనకు ఎక్కడి నుంచి వస్తాయి? అందుకే ఇంట్లో వున్న కోళ్ళని అమ్మక తప్పడం లేదు.

చేతులూ కాళ్ళూ కట్టె పుల్లల్లా మారిపోయి, దవడలు బైటికి పడేటట్లు ముఖం లోనికి పీక్కుపోయి, ఒంట్లో ఒక్క చుక్క రక్తం లేనట్లు తెల్లగా పాలిపోయి ఏదో విచిత్ర ప్రాణి మాదిరి కనిపించే భార్యను చూసి ఒక నిట్టూర్పు విడిచినాడు.

ఆ దినం పేటకుపోయి వీధి వీధీ తిరిగి తిరిగి సాయంత్రానికి కోళ్ళన్నీ అమ్ముకొని జేబులో తొంభై రూపాయల డబ్బుల్తో తిరిగొచ్చినాడు రామప్ప. రాగానే ఒక గుడ్డు భార్య చేతిలో పెట్టినాడు.

"ఎక్కడిది?" అని అడిగింది.

"సరిగ్గా అమ్మే ముందు గుడ్డు పెట్టింది కోడి. వాళ్ళకు కోడినిచ్చి గుడ్డును జేబులో పెట్టుకుని వస్తి" అన్నాడు నవ్వుతూ.

"ఫరవాలేదులే! ఆ మాత్రం తెలివన్నా వుంది" అన్నదామె విరక్తిగా.

అతని మనసు చివుక్కుమంది. తన నిస్సహాయత మీద తనే గొణుక్కున్నాడు.

ఆ రాత్రి ముద్ద తిని, పోయి శెట్టి అంగట్లో కూర్చుని వివరాలు కనుక్కోవడం మొదలు పెట్టినాడు రామప్ప.

"నేను ఎప్పుడూ మండలాఫీసుకు పోయినవాన్ని కాను. అక్కడ ముందుగా ఏ క్లర్కును కలుసుకోవల్ల? వాళ్ళు దుడ్లు అడిగితే ఎంత ఇయ్యల్ల? దుడ్లు చేతిలో పెడితే వ్యవహారమంతా వాళ్ళే చూసుకుంటారా; లేకపోతే నన్ను గూడా బీడీఓ దగ్గరికి పిల్చుకొని పోతారా? పెద్ద ఆపీసర్లతో మాట్లాడల్లంటే నాకు కాళ్ళూ చేతులూ ఒణుకుతాయే! ఎట్లబ్బా చేసేది?" అంటూ విచారించడం మొదలు పెట్టినాడు.

శెట్టి ఒక ఉపాయం చెప్పినాడు.

"మన వెంకట్రామయ్య కూడా రేపు అదే పనిమీద సమితి ఆఫీసుకు పోతానని చెప్పినాడు. ఒక పని చెయ్యి. ఆ దుడ్లు వెంకట్రామయ్య చేతిలో పెట్టి అతని పనితో పాటు నీ పని కూడా జరిపించుకుని రమ్మని అడుగు" అన్నాడు.

ఇంతలో వెంకట్రామయ్య రానే వచ్చినాడు. మనిషి నల్లగా బక్కపల్చగా వుంటాడు. గుంటకళ్ళు! కణతల్లోంచి ఉబ్బెత్తుగా బైటపడే నరాల నిండా తెలివి ప్రవహించిపోతున్నట్లుగా వుంటాడు.

"నువ్వు మా వర్తకుల్లో పుట్టాల్సినవానివి వెంకట్రామయ్యా" అంటుంటాడు శెట్టి అప్పుడప్పుడు నవ్వుతూ.

శెట్టి అడగమన్నట్లుగానే అడిగినాడు రామప్ప. ముందు వెంకట్రామయ్య ఒప్పుకోలేదు. తరువాత బలవంతం మీద మాత్రమే ఒప్పుకుంటున్నట్లు కన్పించినాడు. అప్పుడు ఒక మాట కూడా అన్నాడు—

"చూడు రామప్పా! నా పనితోపాటు నీ పని కూడా చేసుకొస్తాను. కాని నా పక్కన నువ్వు వుండల్ల. ఎందుకంటే నీ అప్లికేషను మీద సంతకం పెట్టేదానికి ఆఫీసు వాళ్ళు ఎన్ని దుడ్లు అడుగుతారో ఏమో! నీకూ ఆఫీసు వాళ్ళకూ మధ్య దుడ్లు దిగమింగినాననే అపవాదు మాత్రం నాకు రాకూడదు" అని!

"ఛఛ! ఎంత మాట వెంకట్రామయ్యా! నాకు నీమీద ఆ మాత్రం యిశ్వాసం లేదనుకుండావా? నా ముఖానికి ఆపీసర్లతో మాట్లాడేది ఎట్లో తెలిసి సస్తే కదా! ఉత్త మొరటునాకొడుకుని. ఇంక నేను వచ్చి కూడా లాభమేముంది! నువ్వే పోయిరాపో అప్పా!" అంటూ డెబ్బయి అయిదు రూపాయిలు చేతిలో పెట్టినాడు.

వెంకట్రామయ్య సమితి ఆఫీసుకు పోయినాడు. క్లర్కుకు నాలుగు డబ్బులు విదిలించినాడు. బిడిఓ దగ్గరికి పోయి నమస్కారం పెట్టి వినయంగా చేతులు కట్టుకుని మాట్లాడినాడు.

ముందుగా రామప్ప అప్లికేషను ఇచ్చినాడు. అప్లికేషనులో వివరాలు సరిగా పొందుపరచలేదు అన్నాడు బిడిఓ. వెంకట్రామయ్య లౌక్యంగా నవ్వుతూ యాభై రూపాయలు అప్లికేషను కింద పెట్టినాడు.


"వివరాలు సరిగానే వున్నాయి కానీ అప్లికేషను నలిగిపోయింది. ఇంకొకటి రాసుకురాపో!" అన్నాడు. వెంకట్రామయ్య అదే నవ్వును ముఖంలో ప్రదర్శిస్తూ మరో ఇర్వై రూపాయలు పెట్టినాడు అప్లికేషను కింద. ఆఫీసరు దొంగ నవ్వు నవ్వుతూ సంతకం పెట్టి, "క్లర్కు దగ్గరికి పోయి సీలు వేసుకో" అన్నాడు.

"మా ఊర్లో ఇట్లాంటివి ఇంకా ఏడెనిమిది అప్లికేషను ఫారాలు వున్నాయి సార్" అన్నాడు.

"తీసుకురా! మార్చి దాటితే ఫండ్స్ వెనక్కు వెళ్ళిపోతాయి" అన్నాడు అధికారి.

తన అప్లికేషను ఫారాన్ని టేబుల్‌మీద పెట్టినాడు వెంకట్రామయ్య.

"ఇది ఎవరిది" అన్నట్లు ప్రశ్నార్థకంగా చూసినాడు



—స్వామి

బిడిఓ.

"ఇది నాది సార్. దయ చూడండి" అన్నాడు. నవ్వుతూ.

"ఆ ఎనిమిది అప్లికేషను ఫారాలూ నువ్వే తెస్తావా?" అన్నాడు వెంకట్రామయ్యను తన నమ్మకస్తులైన బ్రోకర్ల జాబితాలోకి చేర్చుకుంటూ.

"నేనే తెస్తాను సార్" అన్నాడు.

"ఊ! కానీ! స్వామి కార్యంలో స్వకార్యం" అంటూ నవ్వుతూ డబ్బులేమీ తీసుకోకుండానే అప్లికేషను ఫారమ్‌లో సంతకం పెట్టి పంపించినాడు ఆఫీసరు.

వెంకట్రామయ్య తిరిగొచ్చి రామప్ప దగ్గర మరో అరవై రూపాయలు వసూలు చేసుకున్నాడు; బిడిఓ డెబ్బై అయిదు రూపాయలకు ఒప్పుకోలేదు అని చెప్పి.

కొంత కాలానికి వెంకట్రామయ్య ఆరితేరిపోయినాడు.

మండలాఫీసు నుండి సబ్సిడీ పథకం కింద విత్తనాలో, యూరియానో, సూపర్ ఫాస్ఫేట్ లాంటి ఎరువులో పంపిణీ చెయ్యవలసి వచ్చినపుడు తన ఊరి వాళ్ళకూ బిడిఓకూ మధ్య మీడియేటర్‌గా పని చేసినాడు.

మా తోటల్లో కరెంటు స్తంభాలు నాటి నీళ్ళ పంపు సెట్లకు విద్యుత్ సరఫరా చెయ్యాలని ఊర్లో ప్రజలు అర్జీ పెట్టుకుంటే- "తిక్క ప్రజలారా? ఇట్లు అర్జీలు పెట్టి కూర్చుంటే కరెంటు వచ్చేనా? సచ్చేనా?" అని రైతుల దగ్గర చందాలు పోగుచేసి ఆ డబ్బు చేతపట్టుకుని గుత్తికీ హైదరాబాదుకూ చిన్నా పెద్దా ఆఫీసర్ల చుట్టూ తిరిగినాడు.

> ## రోగి
>
> డాక్టర్: "ఈ రోగి చనిపోయాడు"
>
> రోగి: "లేదు! నేనింకా బ్రతికే వున్నాను".
>
> నర్సు: నోరు మూసుకో. డాక్టర్ కంటే ఎక్కువ తెలుసా నీకు?..
>
> —ఎం.బి.

తన ఊరిలో వున్న షెడ్యూల్డు తెగలకు బ్యాంకు ఋణాలు ఇప్పించి, ఆ ఋణాల్ని ఎగవేసే పద్ధతులు కూడా వాళ్ళకు బోధించి, వాటిమీద బ్యాంకులు ఇచ్చే సబ్సిడీలని మాత్రం తన వాటాగా వసూలు చేసుకున్నాడు.

వెంకట్రామయ్య దశ తిరిగింది. సర్పంచుకు కుడి భుజమయినాడు. మండలాధ్యక్షునికి సహచరుడు అయినాడు. ఊర్లోని ఓట్లలో అధిక శాతం ఇప్పుడు అతని చేతిలోనే వున్నాయి. ఒకప్పుడు అడ్డపంచె బనియనుతో తిరిగినవాడు ఇప్పుడు గ్లాస్కో పెద్ద పంచె కట్టి మల్లె పువ్వువంటి ఖద్దరు జుబ్బా ధరిస్తున్నాడు!

'తిక్కోని పెండ్లిలో తిన్నోడే బుద్ధిమంతుడన్నట్లు గవర్నమెంటు సొమ్మును ఎన్ని మార్గాల ద్వారా తిన వచ్చో ఆ అన్ని మార్గాలూ తెలుసుకోవడానికి నిరంతరం బుర్ర ఖర్చుపెట్టి సాధన చేస్తుంటాడు వెంకట్రామయ్య. కృషితో నాస్తి దుర్భిక్షమ్!

ఆ ఏడాది కరువొచ్చి పంటలు పండక తట్టాబుట్టా సర్దుకుని భార్యాపిల్లల్ని వెంటబెట్టుకుని, కూలి కోసం రామప్ప బళ్ళారివైపు వలసపోతుంటే వెంకట్రామయ్యేమో రిజర్వ్‌డ్ అసెంబ్లీ నియోజకవర్గం సీటుకు టికెట్టు కోసం తన ప్రయత్నాల్ని ముమ్మరం చేస్తున్నాడు.

ఒకప్పుడు వెంకట్రామయ్య కూడా రామప్ప మాదిరి చిన్న చేపే! కానీ; ఇప్పుడు...? చిన్న చేపల్ని మింగి మింగి పెద్ద చేపగా మారిపోయినవాడు!! మరి కొంత కాలానికి వెంకట్రామయ్య తన పెద్ద చేప వర్గం నుంచీ తిమింగలం స్థాయికి ఎదిగినా ఎవరూ ఆశ్చర్య పోనవసరం లేదు. ఎందుకంటే అమాయకుడైన రామప్ప మాదిరి వెంకట్రామయ్య నమ్ముకున్నది తన రెక్కల కష్టాన్ని కాదు; బుర్రని మాత్రమే!

జీవితంలో ఎంతో పైపైకి వచ్చిన తన నేస్తగాడు వెంకట్రామయ్యను చూసి రామప్ప అసూయతో గొణుక్కుంటూ వుంటాడు- "కష్టపడేవానికి కాలం కాదిది" అంటూ.

కష్టపడకుండా డబ్బు సంపాదించే మార్గాలు సమాజంలో వున్నంతవరకూ చిన్న చేపలు కూడా పెద్ద చేపలూ, తిమింగలాల స్థాయిని అందుకోవడానికి ప్రయత్నిస్తూనే వుంటాయి. ఆ ప్రయత్నాలకు రామప్ప వంటి మరెన్నో చిన్న చేపలు బలి అయిపోతూనే వుంటాయి. ●




* ఆసక్తి అనుభవము గల స్టాకిస్టులు దిగువ చిరునామాకు సంప్రదించండి.
* Mfrs : SRI SRINIVASA PADMAVATI AGENCIES, 9/49, SAMAJAM STREET, TIRUCHANUR - 517503. A.P.